సాక్షి
తిరుపతి

శనివారం । 8 । జూన్ । 2024



ఆరోగ్యానికి 'చిరు'హారం

ఆరోగ్య రక్షణపై ప్రజలు మరింత శ్రద్ధ వహిస్తున్నారు. ఈమేరకు చిరుధాన్య వంటలపై ఆసక్తి చూపుతున్నారు. - 8లో



అధికంగా యూరియా వాడితే..

పంటల సాగులో అధికంగా యూరియా. రసాయనాలు వాడితే అనర్థమే అని నిపుణులు సూచిస్తున్నారు. - 8లో



శాస్త్రోక్తం.. ధ్వజారోహణం

త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలను శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభించారు. - 8లో

అమాత్య పదవిపై ఆశలు!

కూటమి ఎమ్మెల్యేలు ఇప్పుడు అమాత్య పదవులపై కన్నేశారు. మంత్రి పీఠం ఎక్కేందుకు ముచ్చట పడుతున్నారు. దర్జాగా బుగ్గ కారులో తిరిగాలని ఆశపడుతున్నారు. నూతనంగా ఏర్పాటవుతున్న కూటమి ప్రభుత్వంలో అధికారం అనుభవించాలని తహతహలాడుతున్నారు. కేబినెట్‌లో చోటు దక్కించుకుని పరిపాలనలో భాగస్వాములు కావాలని ఎదురుచూస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ఆశవహులు తమ అధినేతల ముందు ప్రతిపాదనలు పెడుతున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర సర్కారులో ఉన్నత స్థానం పొందేందుకు చిత్తూరు ఎంపీ సైతం పోటీపడుతున్నారు.

- తిరుపతి జిల్లా నుంచి ఐదుగురు.. అందులో ఒకరు జనసేన ఎమ్మెల్యే
- ఎస్సీ కోటా కింద ఇద్దరు.. మరో ముగ్గురు ఓసీ ఎమ్మెల్యేలు
- చిత్తూరు జిల్లా నుంచి సీనియర్ల జాబితాలో అమరనాథ్‌రెడ్డి
- కేంద్ర మంత్రి పదవిపై కన్నేసిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



అమరనాథరెడ్డి



మురళీమోహన్





బొజ్జల సుధీర్‌రెడ్డి



దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



ఆరణి శ్రీనివాసులు

సాక్షి, తిరుపతి : సార్వత్రిక ఎన్నికల పోరు ముగిసింది. కూటమి గెలుపొందింది. త్వరలోనే కేబినెట్ కూర్పు జరగనుంది. ముఖ్యమంత్రిగా చంద్రబాబుతోపాటు కొందరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ జాబితాలో ఎవరికి చోటు లభిస్తుందనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గెలుపొందిన టీడీపీ ఎమ్మెల్యేలు మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. చిత్తూరు జిల్లా విషయానికి వస్తే కుప్పం నుంచి గెలుపొందిన చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపడుతారు. మంత్రి పదవులకు వచ్చేసరికి పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డికే ఎక్కువ అవకాశం ఉంది. జిల్లాలోనే సీనియర్ కావడం, గతంలోనూ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉండడం, చంద్రబాబు, లోకేష్‌తో మంచి సంబంధాలు ఉండడం ఆయనకు కలిసిరానున్నట్లు సమాచారం. ఓసీ కోటా కింద ఒకరికి ఇవ్వాల్సి వచ్చినా.. చిత్తూరు జిల్లా నుంచి అమరనాథ్‌రెడ్డికే ఛాన్స్. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నారు కాబట్టి ఓసీలకు అవకాశం లేదంటే.. ఎస్సీ ఎమ్మెల్యేల్లో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లాలో ఇద్దరు ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒకరు పూతలపట్టు నుంచి గెలుపొందిన మురళీమోహన్, మరొకరు గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్. ఈ ఇద్దరిలో మురళీమోహన్‌కి మంత్రి పదవి వరించే అవకాశం ఉంది. ఆయన సీనియర్ జర్నలిస్ట్ కావడమే అందుకు కారణం . నగరి, చిత్తూరు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, జగన్‌మోహన్‌కి మంత్రి పదవి అవకాశాలు తక్కువనే చెప్పవచ్చు.

తిరుపతి జిల్లా జాబితా పెద్దదే!

జిల్లాలో తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి ఎమ్మెల్యేలు అందరూ మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో మొదటి సారి గెలుపొందిన వారి జాబితాలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే పరసా విజయశ్రీ ఉన్నారు. మహిళల కోటా కింద మంత్రి పదవి వరిస్తే.. విజయశ్రీకే అవకాశాలు ఉన్నాయి. బొజ్జల సుధీర్‌రెడ్డి విషయానికి వస్తే.. తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి చంద్రబాబుతో సాన్నిహిత్యం ఉంది. ఎన్టీఆర్‌ని దింపేసి చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయడంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కీలక పాత్ర పోషించారనే విషయం అందరికీ తెలిసిందే. చంద్రబాబు ఆ కోణంలో ఆలోచిస్తే బొజ్జల సుధీర్‌రెడ్డికి మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశముంది. సీనియర్లకు మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే ముగ్గురు ఎమ్మెల్యేలు పోటీపడుతున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఉన్నారు. ఈ ముగ్గురిలో సీనియర్ కురుగొండ్ల రామకృష్ణ. ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉంది. సీనియర్ల జాబితాలో ఇస్తే గిస్తే వెంకటగిరి ఎమ్మెల్యేనే మంత్రి పదవి వరించే అవకాశం ఉంది. ఎస్సీ కోటా కింద మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే.. ఆదిమూలం లేదా పాశం సునీల్‌కుమార్.. వీరిలో ఎవరికో ఒకరికి మంత్రి వర్గంలో స్థానం దక్కవచ్చు.

జనసేన కోటాలో ఆరణికి అవకాశం

కూటమిలో జనసేన పాత్ర కీలకం. ఈ కూటమి ఏర్పడడానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కారణం. బీజేపీని ఒప్పించి టీడీపీతో జట్టు కట్టించారు. ఈ మూడు పార్టీలు ఏకమవడంతోనే అధికారం దక్కించుకున్నారనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో జనసేన నుంచి తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకి మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రెండో సారి ఎమ్మెల్యే కావడం కూడా ఆయనకు కలిసి రానుంది.

కేంద్ర మంత్రి పదవిపైనా కన్ను!

చిత్తూరు ఎంపీగా గెలుపొందిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు కేంద్ర మంత్రి పదవిపై కన్నేసినట్లు విశ్వసనీయ సమాచారం. కేంద్రంలో టీడీపీ భాగస్వామ్యం కావడంతో ఆయన మంత్రి పదవి ఆశిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన ఇప్పటికే చంద్రబాబు ముందు ప్రతిపాదన పెట్టినట్లు తెలుస్తోంది.



అమరనాథ్‌రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నేత

నాని విధ్వంసకాండ

చంద్రగిరిలో కొనసాగుతున్న అరాచకపర్వం

- రెచ్చిపోతున్న పులివర్తి నాని అనుచరులు
- పోలీసులపైకే దూసుకొస్తున్న టీడీపీ శ్రేణులు
- ఏ.రంగంపేటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం
- పాకాలలో పార్టీ కార్యకర్త పూల దుకాణంపై దాడి
- బాధితులను పరామర్శించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



ఏ.రంగంపేటలోని వైఎస్సార్‌పీ కార్యాలయంలో నాని అనుచరులు ధ్వంసం చేసిన ఫర్నీచర్

సాక్షి, నెట్‌వర్క్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి చంద్రగిరిలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. టీడీపీ కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీల ముసుగులో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం పార్టీ మండల అధ్యక్షుడు, వార్డు సభ్యుడిపై దాడిచేసి గాయపరిచారు. తాజాగా శుక్రవారం మరో కార్యకర్తపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. బాధితుల వివరాల మేరకు.. చంద్రగిరి కొత్తపేటకు చెందిన అంగేరి రాజశేఖర్ అనే కార్యకర్త ఉదయం ఓ దుకాణం వద్ద ఉండగా, టీడీపీకి చెందిన ఉగ్రాణం గురునాథం మరికొందిరతో కలసి దాడికి పాల్పడ్డారు. అనంతరం బాధితుడితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసు స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ధ్వంసం

చంద్రగిరి మండల పరిధిలోని ఏ.రంగంపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. పదుల సంఖ్యలో అక్కడకు చేరుకున్న టీడీపీ నాయకులు, కార్యాలయానికి సంబంధించిన షెట్టర్‌ను పగులగొట్టి లోపలికి వెళ్లారు. కార్యాలయంలోని ఫర్నిచర్, టీవీ, కంప్యూటర్, కుర్చీలు, ఫ్రిడ్జ్ ఇతర సామగ్రిని పూర్తిగా ధ్వంసం చేశారు. కార్యాలయ ఆవరణలోని బెంచీలు, కుర్చీలను పగులగొట్టి బీభత్సం సృష్టించారు. ఈ దౌర్జన్యకాండను చూసి స్థానికులు భయాందోళనగులోనయ్యారు. అటుగా వెళ్తున్న వారు తలోదిక్కున పరుగులు తీశారు.



దేవుడు చూస్తున్నాడు!

'అమాయక ప్రజలపై జరుగుతున్న దాడులను ఆ భగవంతుడు చూస్తున్నాడు.. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం. మంచి రోజులొస్తాయ్.. కొన్ని రోజులు ఓపిగ్గా భరిద్దాం..' అంటూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బాధితులకు ధైర్యం చెప్పారు. టీడీపీ మూకల దాడిలో గాయపడ్డ బాధితులను వారి ఇళ్ల వద్దకే వెళ్లి పరామర్శించారు. అందరికీ మంచి జరుగుతుందని.. ఎవరూ అధైర్య పడొద్దని భరోసానిచ్చారు.

పోలీస్ స్టేషన్‌లో రెచ్చిపోయిన నాని అనుచరులు



పోలీస్ స్టేషన్ వద్ద దాడులకు యత్నిస్తున్న నాని అనుచరులు

చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని అనుచరులు రెచ్చిపోయారు. సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని హల్‌చల్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మస్తాన్‌ను చావబాదారు. ఆపై అడ్డొచ్చిన పోలీసులపైనా తిరగబడ్డారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వైఎస్సార్‌సీపీ కార్యాకర్తలతో పాటు పోలీసు అధికారులపై జరిగిన దాడికి సంబంధించిన వీడియోలు సైతం సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు సమాచారం. పోలీసు స్టేషన్ ఆవరణలోనే దాడులకు పూనుకోవడం జిల్లా అంతటా చర్చనీయాంశమైంది. దాడుల విషయాన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు.



టీడీపీ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు





బాధితులను పరామర్శిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పోలీసు సమాచారం మేరకే వార్తలు

- సంబంధిత పోలీసులు స్పందించకపోతే చర్యలు తీసుకుంటాం
- ఎస్పీ హర్షవర్ధన్ రాజు



తిరుపతి క్రైమ్: జిల్లా పరిధిలో ఏదైనా ఘటనలు జరిగినప్పుడు పోలీసుల సమాచారం మేరకు వార్తలు రాయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. సమాచారం లేకుండా వార్తలు రాయడంతో ప్రజల్లో అపోహలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఘటనలు జరిగినప్పుడు వెంటనే స్థానిక పోలీసుల నుండి సమాచారం స్వీకరించాలన్నారు. ఎవరైనా పోలీసులు ఫోన్ చేసిన సమయంలో సమాధానం చెప్పకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఎవరైనా ఇబ్బందులు కలిగిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలంతా కూడా సమయం మనం పాటించాలన్నారు. భావోద్వేగాలకు గురై హింస చెలరేగే విధంగా ప్రవర్తించకూడదని తెలిపారు. గతంలో తమను ఎవరో అనిచివేస్తారని భావనతో ఇప్పుడు ప్రతీకార చర్యలకు పాల్పడుతున్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలగకుండా చూడాలని తెలిపారు. ప్రతి సమస్యకు పరిష్కార మార్గాలు ఉంటాయని, దానిని చట్ట పరిధిలో ప్రతి ఒక్కరు అనుసరించాలన్నారు. చట్ట పరిధిలో అందరూ సమానమే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. రౌడీయిజం దౌర్జన్యం వంటివి ఎవరైనా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో తమ మాటలు, చర్యలు ద్వారా అనవసరమైన ఆలోచనలు సృష్టిస్తే సహించమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎప్పటికీ జిల్లా ప్రజలందరూ పోలీసులకు సహకరించాలన్నారు.

న్యూస్‌రీల్

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యం



తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సహాయ కార్మిక అధికారి రంగనాథ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులు ఎక్కడైనా ఉన్నారా అని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీమన్నారాయణ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికలో 8మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 8 మంది విద్యార్థులు ఉద్యోగావకాశం పొందినట్లు ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ జేకేసీ ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ వారు కస్టమర్ ట్రైనీ ఉద్యోగాలకు తృతీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులను ఎంపిక చేసుకున్నట్లు వెల్లడించారు. ఎంపికై న వారికి నెలకు రూ.15వేల వేతనం వస్తుందని వివరించారు. కార్యక్రమంలో అపోలో ప్రతినిధి వాసు, జేకేసీ సమన్వయకర్త రమేష్‌కుమార్, పీఆర్‌ఓ ఈశ్వర్ బాబు పాల్గొన్నారు.

10 నుంచి అడ్మిషన్లు

డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశానికి కళాశాలకు రావాలని కోరారు. వివరాలకు 7013105563, 9491520740 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

న్యాయమూర్తులకు ముగిసిన శిక్షణ

తిరుపతి లీగల్ : రాయలసీమ జిల్లాల్లోని 30 మంది న్యాయమూర్తులకు నాలుగు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు తిరుపతి మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయమూర్తులకు శిక్షణ ఇచ్చిన ఢిల్లీ జిల్లా జడ్జి నిరజా భాటియా, కర్ణాటకకు చెందిన సీనియర్ ట్రైనర్ సుశీలను జిల్లా జడ్జి సన్మానించారు. అనంతరం జిల్లా జడ్జి భీమారావును తిరుపతి అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, జిల్లా న్యాయ సేవా సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి రవి సత్కరించారు.

నృత్య అకాడమీ చైర్‌పర్సన్ రాజీనామా



పాటేళ్ల శిరీష

సైదాపురం : రాష్ట్ర నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పాటేళ్ల శిరీషయాదవ్ తన పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ఏపీ స్టేట్ కల్చివేషన్ అండ్ కల్చరల్ కమిషన్‌కు అందజేశారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండేళ్లుగా సంగీత నృత్య అకాడమీ రాష్ట్ర చైర్‌పర్సన్‌గా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయం పొందడంతో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసినట్లు వివరించారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 27 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,161 మంది స్వామివారిని దర్శించుకోగా 28,923 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.35 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పార్టీ అధినేతను కలిసిన అభినయ్



పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి అర్బన్: వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం విజయవాడ క్యాంప్ కార్యాలయంలో తిరుపతి వైఎస్‌ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన భూమన అభినయ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల సరళిని తెలియజేశారు.

విద్యార్థులకు ముగిసిన శిక్షణ



విద్యార్థులతో ప్రసన్నకుమార్

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో ఉన్న ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. పలు దినపత్రికల్లో వస్తున్న కరెంట్ వార్తలను చదవడం ద్వారా అనేక అంశాలను తెలుసుకునే వెసులుబాటు ఉంటుందని వెల్లడించారు. గ్రంథాలయ వేసవి శిబిరానికి వచ్చిన విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించిన లైబ్రేరియన్ సూర్యనారాయణమూర్తిని అభినందించారు. కార్యక్రమానికి ఫిజికల్ డైరెక్టర్ వెంకటముని, రిసోర్స్‌పర్సన్ మహాలక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, వి.మనోజ్ బాబు, ఎన్.రాధమ్మ, ఆర్.భారతి, టి.ప్రతాప్, మణికంఠ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుచ్చిపై సిరులతల్లి విలాసం



బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా వేకువనే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. అభిషేకానంతరం అమ్మవారిని పట్టుపీతాంబరాలు, వజ్రవైఢూర్యాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో పాంచరాత్ర ఆగమోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలోని అలంకార మండపంలో కనులపండువగా అమ్మవారికి ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం సర్వాలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

వ్యవసాయ మండలి పదవికి రాజీనామా



రామచంద్రారెడ్డి

బంగారుపాళెం: వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ పదవికి మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని ప్రభుత్వానికి పంపినట్లు ఆయన చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి చెందడంతో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

ఆరోగ్యానికి 'చిరు'హారం

ఆరోగ్యకర ఆహారంపై ప్రజలకు ఆసక్తి పెరిగింది. పోషకాలతో కూడిన పదార్థాలను భుజించడంపై మక్కువ అధికమైంది. ముఖ్యంగా చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ఆరగించేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో పాత తరం అలవాట్ల దిశగా ప్రజానీకం మొగ్గుచూపుతోంది. వినియోగం మేరకు చిరుధాన్య పంటలను పండించేందుకు రైతాంగం సైతం ముందుకు వస్తోంది. డిమాండ్‌కు తగ్గట్టు ఏటా సాగు విస్తీర్ణం పెంచుకుంటోంది. పోషకాల ఉత్పత్తులను విక్రయించుకుని చక్కటి ఆదాయం పొందుతోంది.

- జిల్లాలో పెరిగిన చిరుధాన్యాల వినియోగం
- 2వేల ఎకరాలకు పైగా సాగు చేస్తున్న రైతాంగం
- ఆహారంగా తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజానీకం
- గిట్టుబాటు ధరలతో అన్నదాతల ఆనందం



తిరుపతి అర్బన్ : చిరుధాన్యాల వంటలపై ప్రజలు అధికంగా మక్కువ చూపుతున్నారు. వీటిల్లో పోషకాలు ఉండడం.. ఆరోగ్యం మెరుగు పడుతుండడంతో డిమాండ్ పెరిగింది. ఈ ధాన్యాలను భుజించడం ద్వారా పిల్లల్లో మంచి ఎదుగుదల ఉంటుందని, పెద్దల అనారోగ్య సమస్యలకు చెక్ పడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో వీటిని వినియోగించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

పెరిగిన వినియోగం

పాతకాలపు ఆహారపు అలవాట్లు దిశగా అధిక సంఖ్యలో జనం నడుస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం వరకు చాలావరకు చిరుధాన్యాలనే ఆహారంగా ఎక్కువ మంది తీసుకునేవారు. రాగులు, జొన్నలు వంటి వాటితో రొట్టెలు తయారు చేసుకొని తినేవారు. పట్టణ జీవన శైలిలో చిరుధాన్యాల వినియోగం గణనీయంగా తగ్గి, వరి అన్నం తినడం మొదలైంది. ఫలితంగా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం, పండించే రైతుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. అనారోగ్య సమస్యలు, కోవిడ్ మహమ్మారి తర్వాత ప్రజల ఆహారం అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. చిరుధాన్యాల ప్రయోజనాలు అర్థమయ్యాయి. దీంతో వీటి వినియోగం.. ఆ మేరకు డిమాండ్ పెరిగింది. సాధారణంగా చిరుధాన్యాల్లో జొన్నలు, సజ్జలు, రాగులు ప్రధానమైనవి. అరికెలు, సామలు, అండుకొర్రలు, ఊదలు లాంటి వాటిని సూక్ష్మ ధాన్యాలుగా పిలుస్తారు. వరి, గోధుమలకన్నా ఇవన్నీ అధికంగా పోషక విలువలను కలిగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చిరుధాన్యాల వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయి. శరీరంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తపోటును, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచడం, రోగ నిరోధక శక్తిని పెంచడం వంటి లాభాలున్నట్లు పరిశోధకులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం షుగర్ వ్యాధితో అనేకమంది బాధపడుతున్నారు. వీరంతా చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటున్నారు.

జిల్లాలో పెరిగిన సాగు...

జిల్లాలో చిరుధాన్యాల సాగు పెరిగింది. వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం సుమారు 2వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది. క్రమేణా ఒక్కో సీజన్‌లో వీటి సాగు పెరుగుతూ ఉంది. ఖరీఫ్ తర్వాత రబీకి 2వేల ఎకరాలకు పైగా జిల్లాలోని అన్ని మండలాల్లో సాగుచేయనున్నారు. ఎకరం వరి సాగు చేసేందుకు అయ్యే ఖర్చుతో మూడు ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేసే అవకాశాలు ఉండడంతో రైతులు ఇటువైపు మొగ్గు చూపుతున్నారు. రసాయనాలు, పురుగు మందులు అధికంగా వినియోగించి ప్రస్తుతం పంటలు పండిస్తున్నారు. చిరుధాన్యాలు పండించేందుకు నీరు అధికంగా అవసరం ఉండదు. చిన్నపాటి వర్షం పడినా చాలు. ప్రజల్లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని అధికారులు సాగు, మార్కెటింగ్‌కు గతంలోనే ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిరుధాన్యలతో ఇడ్లీ, దోసె, ఉప్మా, పొంగల్ తదితర వంటకాలను వండుతున్నారు. కొర్రలు, అండుకొర్రలతో రొట్టె, లడ్డూలు, మురుకులు, కేసరి, హల్వా తదితర పదార్థాలు తయారు చేస్తున్నారు. మిక్సడ్ మిలెట్స్ దోసె, ఇడ్లీలు, పొంగల్, పులిహోర సిద్ధం చేసుకుని భుజిస్తున్నారు. అలాగే జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొన్ని దుకాణాల వారు చిరుధాన్యాల వంటలు విక్రయిస్తున్నారు. స్వీట్ షాపుల్లో ప్రత్యేకంగా అమ్ముతున్నారు.

ప్రోత్సహిస్తున్నాం

జిల్లాలో ఊరూరా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఆరోగ్యానికి చిరుధాన్య పంటలు ఎంతో దోహదపడతాయి. అందుకే మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. ధరలకు ఢోకాలేదు. నీటి వినియోగం తక్కువ. చిరుధాన్య పంటలను రైతులు సాగుచేస్తే అధిక ఆదాయం పొందే అవకాశముంది. రాబోయే రోజుల్లో భారీగా సాగు పెంచేందుకు చర్యలు చేపడతాం.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

అధికంగా యూరియా వాడితే అనర్థమే!

- తక్కువగా రసాయనిక ఎరువులు వినియోగించాలి
- వరిసాగులో వృథా ఖర్చులు తగ్గించాలి
- సూచనలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



వరిపైరుకు యూరియా వేస్తున్న రైతు (ఫైల్)

తిరుపతి అర్బన్: పంటల సాగులో అధికంగా యూరియా వాడితే అనర్థమే అని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు రసాయనిక ఎరువులను తక్కువగా వినియోగించుకోవాలని వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా వరిసాగులో వృథా ఖర్చులను తగ్గించుకుంటే అధిక ఆదాయం పొందవచ్చని వివరిస్తున్నారు.

నత్రజని అవసరం

వరి పైరు ఏపుగా పెరిగేందుకు, అధిక పిలకలతో దుబ్బు చేయడానికి, వెన్నులు బాగా రావడానికి నత్రజని చాలా అవసరం. నత్రజని ఎరువు (యూరియా)ను దుక్కిలో పిలకలు పెట్టే దశలో, చిరుపొట్ట దశలో రకాన్ని బట్టి ఎకరాకు ఒకసారికి 35 నుంచి 45 కిలోలు వేయడానికి వ్యవసాయాధికారులు సిఫార్సు చేస్తారు. అయితే కొందరు రైతులు పిలకల దశలో (నాటిన 2 నుంచి 3 వారాల మధ్య) సిఫార్సు చేసిన మోతాదు కంటే అధికంగా (ఎకరాకు 2 బస్తాల వరకు) వేస్తున్నారు. ఈ దశలో అధికంగా యూరియా వాడకం వల్ల పైరుకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. పైరు విపరీతంగా పెరిగిపోవడం, ముదురు ఆకుపచ్చరంగుకు మారి చీడలకు అధికంగా గురవుతుంది. పైరుకు వాడిన యూరియాలో మొక్కలు కేవలం 30 నుంచి 35 శాతమే వినియోగించుకుంటాయి. మిగతా అంతా వృథాగా పోతుంది. దీంతో చీడల నివారణకు అధిక ఖర్చును రైతు భరించాల్సి వస్తుంది.

గుళికల మందు కలిపి వాడొద్దు..

చాలా మంది రైతులు మొదటగా దుక్కిలో వేసే యూరియాతోపాటు 4 నుంచి 5 కిలోల గుళికల మందును కలిపి వాడుతుంటారు. గుళికల పురుగు మందు విడిగా వేయడానికి ఖర్చవుతుందని ఇలా చేస్తుంటారు. పురుగుల నివారణకు మందు రకాన్ని బట్టి ఎకరాకు 7 నుంచి 10 కిలోల గుళికలు వేయాల్సి ఉంటుంది. యూరియాలో 4 నుంచి 5 కిలోల గుళికలు కలిపి వేస్తే.. పురుగులు చావకపోగా ఆ మందును తట్టుకునే శక్తిని సంపాదించుకుంటాయి. తర్వాత ఈపురుగులపై ఇతర మందులు వాడినా నివారించడం కష్టమవుతుంది. రైతులు యూరియాతో గుళికల మందును కలిపి వాడకుంటే మంచిది.

దుక్కిలో కాంప్లెక్సు ఎరువులు వద్దు

పిలకల దశలో వరికి వేసే యూరియాతో పాటు చాలా మంది రైతులు డీఏపీ , 20-20-0 వంటి కాంప్లెక్సు ఎరువులను ఎకరాకు ఒక బస్తా చొప్పున వేస్తుంటారు. ఈ కాంప్లెక్స్ ఎరువులలో ఉండే భాస్వరం కేవలం 20 నుంచి 25 శాతం మాత్రమే మొక్కలకు అందుతుంది. మిగతాది అంతా భూమిలో మొక్కలకు అందని స్థితిలో మారిపోతుంది. వాస్తవంగా చెప్పాలంటే ఈ కాంప్లెక్స్ ఎరువులపై పెట్టే ఖర్చులో కేవలం రూ.350 నుంచి రూ.400 మాత్రమే మొక్కలకు అంది.. మిగతాది రూ.900 నుంచి రూ.1000 వరకు వృథా అవుతుంది. దీనికి బదులు ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న నానో డీఏపీని ఎకరాకు అర లీటరు స్ప్రే చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయి. వీటి ధర రూ.600 మాత్రమే ఉంటుంది.

రైతులకు శిక్షణ ఇస్తున్నాం

వరితోపాటు ఇతర పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి. ప్రధానంగా యూరియాను విస్తారంగా వాడుతున్నారు. దాంతో నష్టాలే అధికం. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే మంచిది. భూములకు రక్షణతోపాటు ఆరోగ్యానికి హాని లేకుండా ఉంటుంది. ఈ క్రమంలో అవసరాలకు తగ్గట్టు రైతులకు శిక్షణ ఇస్తున్నాం.

– ప్రసాద్‌రావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి

మహిళ ఆత్మహత్య



మృతి చెందిన వెంకటమ్మ

నాయుడుపేటటౌన్ : మండలంలోని చిగురుపాడులో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటమ్మ (45) భర్త మరణించడంతో తల్లితో కలిసి నివసిస్తోంది. ఈ క్రమంలో కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇక తట్టుకోలేక గురువారం ఉదయం పురుగుమందు తాగేసింది. స్థానికులు గుర్తించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించగా అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం రాత్రి మరణించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి..



చంద్రశేఖర్ (ఫైల్)

నాగలాపురం: పట్టణంలోని సాయి నగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. చంద్రశేఖర్(52) అనే వ్యక్తి కూలి పని చేసుకుంటూ పొట్టపోసుకునేవాడు. ఈ క్రమంలో స్థానిక బజారువీధికి చెందిన భరత్ అనే వ్యక్తి వద్ద కొంత నగదు అప్పు చేశాడు. సకాలంలో ఇవ్వలేకపోవడంతో భరత్ నిత్యం వేధించేవాడు. ఈ వేధింపులను తట్టుకోలేక చంద్రశేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన భార్య మునెమ్మ తన భర్త మృతదేహాన్ని చూసి కేకలు వేసింది. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ ఓబయ్య వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు

పూతలపట్టు: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ నైనార్ మధుబాల అన్నారు. గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు వెళ్లి పఠనా సామర్థ్యం పెంచుకునేలా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని సూచించారు. ఇంగ్లిష్ గ్రామర్, పద్యాలు, కథలు, డ్రాయింగ్, హ్యాండ్‌బాల్, సంగీతం, నాట్యం వంటి వివిధ రకాలైన శిక్షణలతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు వేసవి శిబిరాలు దోహదపడుతాయని తెలిపారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లడం దినచర్యగా మార్చుకుని, దిన పత్రికలు, విజ్ఞాన పత్రికలు చదవాలని తెలిపారు. శిక్షణ శిబిరాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మధుబాల బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి రవీంద్రబాబును అభినందించారు.

ఆగని గజ దాడులు



ధ్వంసమైన టమాట తోట

పెద్దపంజాణి: మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పెద్దకాప్పల్లె పంచాయతీలోని అటవీ సరిహద్దు గ్రామాలైన ఆకులవారిపల్లె, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె, పెనుగొలకల, పెద్దకాపల్లె, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లె ల్లో పంటలను నాశనం చేస్తున్నాయి. గురువారం రాత్రి పుంగనూరు రేంజ్ పేటూరు బీట్ నుంచి వచ్చిన ఏనుగులు కొత్తబూరగపల్లె గ్రామ సమీపంలోని టమాట, మామిడి తోటలపై విధ్వంసం సృష్టించాయి. టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. శుక్రవారం ఉదయం పొలాల వద్దకు వెళ్లిన రైతులు పంటనష్టాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. రాయలపేట ఫారెస్టు బీట్ ఆఫీసర్ రవికుమార్ పంట నష్టాన్ని పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ట్రాకర్ల సాయంతో ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

17 నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): అప్పలాయిగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం శుక్రవారం తెలిపారు. ఈనెల 11వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న సాయంత్రం అంకురార్పణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 17 ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం పెద్దశేష వాహనం, 18 ఉదయం చిన్నశేష వాహనం, సాయంత్రం హంస వాహనం, 19 ఉదయం సింహ వాహనం, సాయంత్రం ముత్యపుపందిరి వాహనం, 20 ఉదయం కల్పవృక్ష వాహనం, సాయంత్రం కల్యాణోత్సవం, సర్వభూపాల వాహనం, 21 ఉదయం మోహినీ అవతారం, సాయంత్రం గరుడ వాహనం, 22 ఉదయం హనుమంత వాహనం, సాయంత్రం గజ వాహనం, 23 ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 24 ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వవాహనం, 25 ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నట్లు వివరించారు. శ్రీవారి కల్యాణోత్సవంలో రూ.500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాససాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నిత్యం ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సేంద్రియం.. లాభాల సేద్యం



కాకవేడులో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న బేనీషా రకం మామిడి

ప్రపంచీకరణ నేపథ్యంలో సేంద్రియ సాగు(ఆర్గానిక్) పంటల దిగుబడులకు ఎగుమతి అవకాశాలతో పాటు అధిక డిమాండ్ ఉంటోంది. రసాయనాలకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా నేలతల్లి ఆయుష్షును పెంచడంతో పాటు ఆరోగ్యకర పంట దిగుబడులకు ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైందని రైతులు గుర్తించారు. ప్రకృతిలో దొరికే ఆకుల కషాయాలను వాడుతూ పండించే పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. దీంతో రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించారు. నగరి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో మామిడి, కూరగాయల పంటలు సేంద్రియ పద్ధతిలో సాగవుతున్నాయి.

- ఆరోగ్యకర పంటల దిగుబడులు
- మార్కెట్ మంచి ధరలు
- మామిడి, కూరగాయాల పంటల సాగు

నగరి : నియోజకవర్గంలో రైతులు రసాయనిక సాగుకు హానికరమని గుర్తించారు. సేంద్రియ సాగుపై దృష్టి సారించారు. మామిడి, కూరగాయల పంటలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మార్కెట్‌లో రసాయనాలు వాడి పండించిన మామిడి నిగనిగలాడుతూ కనిపిస్తున్నా అవి కాల్షియం కార్బైడ్‌తో మాగపెట్టిన పండ్లు కావడంతో కొనుగోలు చేసుకోవడానికి జనం సంశయిస్తున్నారు. పక్వానికి రాని మామిడి పండ్లు, గాలికి రాలిన మామిడి పండ్లను సైతం రసాయనాల ద్వారా మాగనిచ్చి మార్కెట్‌లో చౌకగా అమ్మకాలకు ఉంచుతున్నారు. ఇవి పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి రుచి పుల్లగా ఉంటుంది. ముక్కు దగ్గరగా ఉంచుకున్నప్పుడు మాత్రమే పండు వాసన వస్తుంది. పండు త్వరగా చెడిపోతుంది. వీటిని తింటే ఆరోగ్యానికి హానికరమంటూ వ్యవసాయ అధికారులు, వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో పలువురు రసాయనాలు వాడక సేంద్రియ పద్ధతిలో సాగు చేయడంతో పాటు వాటిని ఎలాంటి రసాయనాలు లేకుండా కసువు వేసి మాగనిచ్చే మామిడి పండ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. కాస్త ధర ఎక్కువైనా ఆరోగ్యం ప్రధాన మంటూ ఆర్గానిక్ మామిడి పండ్లు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. తినే సమయాల్లో ఈ పండ్లు ఇచ్చే రుచి ఆర్గానిక్ పండ్లు అంటే ఇవిరా... అన్నట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

నియోజకవర్గంలో ఇలా..

నగరి నియోజకవర్గంలో 50 ఎకరాల్లో మామిడి, కూరగాయల పంటలు సేంద్రియ పద్ధతిలో సాగవుతున్నాయి. నగరి మండలంలోని కాకవేడు, ముడిపల్లె ప్రాంతాల్లో 10 ఎకరాల్లో, విజయపురం మండలం కోసలనగరంలో పది ఎకరాల్లో మామిడి ఈ పద్ధతిలో సాగవుతోంది. ఇప్పటికే వ్యవసాయ అధికారులు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తుండడం, స్థానికంగానే ఉన్న రైతు భరోసా కేంద్రాలు సలహాలు అందిస్తూ ప్రోత్సహిస్తుండడం రైతుకు ధైర్యాన్ని ఇస్తోంది. వేలల్లో ఖర్చయ్యే ఎరువులకు, పురుగుల మందులకు స్వస్తిపలికి సొంతంగా తయారు కషాయాలను తయారుచేసుకుంటున్నారు. పంచకావ్య, బ్రహ్మాస్త్రం, ఆగ్నాస్త్రం, నీమాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కంపోస్టు, వేపపిండి, జనుము లాంటివి ఎరువుగా వినియోగిస్తున్నారు.

భూసారానికి రక్ష

సేంద్రియ సాగు ద్వారా భూమి సారం కోల్పోదని, ఆరోగ్యకరమైన దిగుబడులు వస్తాయని వస్తుందని రైతులు చెబుతున్నారు. వీటి వాడకం వల్ల భూసారం పెంచే వానపాములు తయారవుతాయని అంటున్నారు. ఈ పద్ధతిలో పండించిన పంటల్లోను వ్యత్యాసం ఉంటోందన్నారు. పంటల కొనుగోళ్లకు కూడా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటోందని చెబుతున్నారు. రసాయనాలు వాడే పంటకన్నా ఈ పద్ధతిలో పండించే పంట దిగుబడులు ఆరోగ్యకరంగా ఉండడంతో మంచి డిమాండ్ ఉంటోందని రైతులు పేర్కొంటున్నారు.



సేంద్రియ విధానంలో సాగు



గడ్డి, పేపర్ ముక్కలతో మగ్గబెట్టిన మామిడి

శాస్త్రోక్తం.. ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

యాదమరి (బంగారుపాళెం): మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో వెలసిన ఇంద్రవరదుని బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చక వేదపండితులు శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. అంతకముందు వేకువజామున మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదునికి ప్రత్యేక అభిషేకాలు అలంకరణ, అర్చన నిర్వహించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి మేళతాళాలతో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ధ్వజస్తంభం వద్ద కొలువు తీర్చి పూజలు చేశారు. భట్టాచార్యులు పవనకుమార్ స్వామి, వరదరాజ ఆచార్యులు, శ్యామసుందర ఆచార్యులు వేద మంత్రాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి 12 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆగమ శాస్త్ర ప్రకారం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి భక్తులు హాజరై కర్పూర నీరాజనాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం బలిపీఠం, ఉత్సవ మూర్తులను పుర వీధులలో ఊరేగించారు. భక్తులు స్వామివారికి నారికేళాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రప్రభ వాహనంపై దేవదేవేరుల విహారం

స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో దేవదేవేరులు శుక్రవారం రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు వాహన మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరదుని ఉత్సవమూర్తులను చంద్రప్రభ వాహనంలో కొలువు తీర్చి సుగంధ పుష్పాలతో అలంకరించి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చక వేదపండితులు మురళీ, హేమంత్ ఆచార్యులు, కృష్ణాచార్యులు

నేడు హంసవాహన సేవ

ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పించనున్నారు. అనంతరం దేవదేవేరులు సప్రంలో ఉత్సవంలో రాత్రి హంస వాహనంపై ఊరేగించనున్నట్లు తెలిపారు.

ముక్కంటి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆలయ అధికారులు, సిబ్బందిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేస్తూ ఈఓ నాగేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఆలయ అధికారి కృష్ణారెడ్డిని గోశాల నుంచి మాస్టర్‌ప్లాన్, మీడియాపాయింట్, మింట్, అన్నదానానికి బదిలీ చేశారు. లోకేష్‌బాబును మాస్టర్‌ప్లాన్, మింట్, అన్నదానం మీడియా పాయింట్ నుంచి ప్రధాన ఆలయానికి, ధనపాల్‌ను ప్రధాన ఆలయం నుంచి గోశాలకు, రాజశేఖర్‌ను మీడియా పాయింట్ నుంచి ఎస్టాబ్లిష్‌మెంట్‌కు, ప్రదీప్‌రెడ్డిని లీగల్, ల్యాండ్స్ నుంచి ఈఓ సీసీగా, జూనియర్ అసిస్టెంట్ అన్వేష్‌ను ఎస్టాబ్లిష్, నర్సింగ్ నుంచి లీగల్, ల్యాండ్స్‌కు, మహేష్‌ను ఐటీ ఫైలింగ్ నుంచి క్యాషియర్‌గా, కాంట్రాక్టు ఉద్యోగి అనిల్‌బాబును ఆలయం నుంచి వాచ్ అండ్ వార్డుగా, మయూర్‌కుమార్‌ను పరిపాలన భవనం నుంచి స్టేషనరీ వింగ్‌కు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుధీర్‌ను రూ.500 రాహుకేతుపూజా మండపం నుంచి రైల్వేస్టేషన్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్‌కు, కిరణ్‌కుమార్‌రెడ్డిని పబ్లికేషన్ స్టాల్ నుంచి వీఐపీ లాంజ్‌కు బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర్వుల మేరకు ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తించాలని తెలిపారు.